JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజ్‌గిరి । శుక్రవారం 10-04-2026
Medchal - Malkajgiri | Friday 10-04-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 313
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 | Issue 313 | Pages : 8 | ₹: 5


6 లో

## పోటెత్తిన ఓటర్లు
## భారీగా పోలింగ్ నమోదు

- హోరాహోరీ పోరులో భారీ ఓటింగ్.. కేరళ
- అసోం, పుదుచ్చేరిలోనూ రికార్డు స్థాయి పోలింగ్
- ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో భాగంగా పుదుచ్చేరి, అసోం, కేరళల్లో పోలింగ్ ముగిసింది. భారీ ఎత్తున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**జయభేరి, న్యూఢిల్లీ:**

అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న మూడు ముఖ్యమైన రాష్ట్రాల్లో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. కేరళ, అసోం , కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలలో ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో భద్రపరిచారు. సాయంత్రం 5 గంటల వరకు నమోదైన అధికారిక గణాంకాలను బట్టి చూస్తే, ప్రజలు భారీ ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చినట్లు స్పష్టమవుతోంది.

**కేరళ: హోరాహోరీ పోరులో భారీ ఓటింగ్**
కేరళలోని మొత్తం 140 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించారు. ఎల్డీఎఫ్ (LDF) , యూడీఎఫ్ (UDF) మధ్య ప్రధాన పోటీ నెలకొన్న ఈ రాష్ట్రంలో ఓటర్లు ఎప్పటిలాగే చైతన్యాన్ని చాటారు. ...మిగతాది 2 లో




# జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ లో సముచిత స్థానం

ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్ లో చేరిక.. జీవన్ రెడ్డి

**జయభేరి, జగిత్యాల :**

మాజీ మంత్రి జీవన్ రెడ్డితో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డిని కేసీఆర్ సూచన మేరకు మా సహచరులందరితో కలిసి సాదరంగా ఆహ్వానించేందుకు వచ్చాం. 2014 ఎన్నికలకు ముందే కేసీఆర్ జీవన్ రెడ్డిని ఆహ్వానించారు. కానీ, నిబద్ధత గల నాయకుడిగా ఆయన కాంగ్రెస్ తోనే కొనసాగారని అన్నారు. కేసీఆర్, జీవన్ రెడ్డి బంధం ఈనాటిది కాదు. జూన్ 2, 2014లో ముఖ్యమంత్రిగా పదవి చేపట్టాక మొట్టమొదటి సారి జగిత్యాలకు వచ్చారు. ఆరోజు బోర్నపల్లి బ్రిడ్జి గురించి జీవన్ రెడ్డి కేసీఆర్ ను అడిగారు. ఆయనడిగిందే తడవుగా కరీంనగర్ జిల్లాలో మొట్టమొదటి సాంక్షన్ ఇచ్చారు. షుగర్ ఫ్యాక్టరీపై జీవన్ రెడ్డి ఫైట్ చేశారు. ఆ క్రమంలోనే కేసీఆర్ మహారాష్ట్ర తరహా కో ఆపరేటివ్ సొసైటీ పద్ధతిలో పెడదామన్నారు. పార్టీ బలోపేతానికి జీవన్ రెడ్డి చేరిక బాగుంటుందని జగిత్యాల నాయకత్వం కూడా మద్దతు తెలిపిందని అన్నారు. కాలం నెట్టుకొచ్చే ప్రభుత్వం ఇది. మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు. 70 లక్షల కోట్లు రైతులకు బకాయి పడ్డారు. బాసరలో ముఖ్యమంత్రి భాష అసహ్యంగా ఉంది. నిఖార్సైన జీవన్ రెడ్డి వంటి నేతలను అవమానపరుస్తోంది ఈ కాంగ్రెస్. నేను భట్టి ఇంటికి పెళ్లికి పోయినప్పుడు కూడా వంద మంది రాబోయేది మీ ప్రభుత్వమేనన్నారు. సీఆర్ ను కూడా కలిసి తన నిర్ణయం ప్రకటిస్తామన్నారు జీవన్ రెడ్డి. జీవన్ రెడ్డికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని అయన స్పష్టం చేసారు. జీవన్ రెడ్డి మాట్లాడూ కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్ మా ఇంటికి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చారు. హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. కాంగ్రెస్ నుంచి రాజీనామా భావోద్వేగానికి గురి చేసింది. ఇవాళ బీఆర్ఎస్ తో కలవడం సంతోషంగా ఉంది. గత 20 మాసాలుగా అవమానాలు తట్టుకుని ఓపిక పట్టా. ఎందరి ప్రభుత్వాలో చూశాను.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉంది. ప్రజాభిప్రాయం మేరకే ఈ నిర్ణయం. కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం సంతోషంగా ఉందని అన్నారు.

# డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



- ఇరాన్, అమెరికా మధ్య వర్కౌట్ కాని కాల్పుల విరమణ ఒప్పందం
- పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత

**జయభేరి, న్యూఢిల్లీ:**

అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన రెండు వారాల తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం సంక్షోభంలో పడింది. గల్ఫ్ దేశాలపై డ్రోన్ దాడులు, లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగాయి. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పాలనే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ప్రస్తుతం బ్రేక్ పడే పరిస్థితి ఏర్పడింది. కేవలం రెండు వారాల గడువుతో కుదిరిన ఈ ఒప్పందం , అమలులోకి వచ్చిన కొద్ది గంటల్లోనే ఉల్లంఘనలకు గురికావడం గమనార్హం. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలను రేకెత్తిస్తోంది. రాజకీయ చర్చల ద్వారా శాశ్వత పరిష్కారానికి కనుగొనే ఉద్దేశంతోనే వాషింగ్టన్, టెహ్రాన్ ఈ వారం తొలినాళ్లలో దాడులను నిలిపివేయాలని నిర్ణయించుకున్నాయి. అయితే ఈ ప్రకటన వెలువడిన గంటల్లోనే ...మిగతాది 2 లో




# ఈవీ చార్జింగ్ స్టేషన్లు


- నగరవ్యాప్తంగా మరో 13 కొత్త ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు
- ఈ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి వస్తే నగరంలోని వివిధ రూట్లలో ఎలక్ట్రిక్ బస్సుల రాకపోకలు మరింత సులభతరం

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 9 :**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు టీజీఆర్టీసీ తన రవాణా వ్యవస్థను ఆధునీకరిస్తోంది. పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు పాత డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్న ఆర్టీసీ.. ఇప్పుడు వాటికి అవసరమైన మౌలిక సదుపాయాల విస్తరణపై దృష్టి సారించింది. నగరంలోని అన్ని ప్రధాన డిపోల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి వచ్చేలా ఆర్టీసీ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇప్పటికే కంటోన్మెంట్, మియాపూర్, రాణిగంజ్, హయత్‌నగర్, హెచ్‌సీయూ వంటి కీలక డిపోల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉండగా.. వచ్చే నెలలో కూకట్‌పల్లి స్టేషన్‌ను కూడా ప్రారంభించనున్నారు. నగరవ్యాప్తంగా మరో 13 కొత్త ప్రాంతాల్లో ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఫరూక్‌నగర్, బర్కత్‌పుర, మెహిదీపట్నం, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, ఉప్పల్, చెంగిచెర్ల, జీడిమెట్ల, కాచిగూడ, మిధాని, బండ్లగూడ, ముషీరాబాద్, జవహర్‌నగర్ డిపోలను ఇందుకోసం ఎంపిక చేశారు. ఏడాది కాలంలోనే ఈ స్టేషన్లన్నింటినీ ...మిగతాది 2 లో

# తండ్రి జోక్యం ఎక్కువైందని చీవాట్లు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి క్లాస్
- ఆంధ్రప్రదేశ్‌లో కొందరి నేతల పని తీరుపై వస్తున్న విమర్శలతో ముఖ్యమంత్రి చంద్రబాబు అలర్ట్
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు స్వీట్ వార్నింగ్



**జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 9 :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాల వారీగా నాయకులతో మాట్లాడుతున్నారు. జిల్లాలో ఉన్న పెండింగ్ సమస్యలు, నాయకుల పనితీరు, వారిపై ఉన్న ఫిర్యాదులు అన్నింటిపై చర్చిస్తున్నారు. ఈ మధ్య శ్రీకాకుళం జిల్లా నాయకులతో మాట్లాడారు. బుధవారం విజయనగరం జిల్లా నాయకులతో ...మిగతాది 2 లో

# మాటలతో హామీల అమలు

- వాక్చాతుర్యంతో బురిడి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పెళ్లైన మూడు నెలలకే బిడ్డ పుడతారా.. హామీల అమలుకు సమయం కావాలి
- రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వాక్చాతుర్యంతో ఎంతకాలం నెట్టుకొస్తుందో


2 లో

# వేగంగా ఫ్యూచర్ సిటీ అడుగులు




- ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీకి సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై ధర్మాసనం ఊరట
- ఫ్యూచర్ సిటీలో చట్టవిరుద్ధంగా.. నిబంధనలను అతిక్రమించి.. ఎలాంటి పనులు చేపట్టబోమని హామీ

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 9 :**

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై స్టే ఇచ్చేందుకు చెన్నై ఎన్జీటీ నిరాకరించింది. పర్యావరణ అనుమతులు లేకుండానే ఫ్యూచర్ సిటీని ప్రభుత్వం చేపడుతోందని పిటిషనర్ వాదించగా.. అది ఇంకా తొలి దశలోనే ఉందని.. ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ప్రభుత్వం తరపు లాయర్ వాదించారు. అయితే నిబంధనలను ఉల్లంఘించి ఎక్కడా పనులు చేయబోమని ఎన్జీటీకి ప్రభుత్వం తరపు లాయర్ వివరించారు. దీంతో ఈ పిటిషన్‌పై విచారణను ఎన్జీటీ వాయిదా వేసింది. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీకి సంబంధించి నేషనల్ ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## భారీగా పోలింగ్ నమోదు

సాయంత్రం 5 గంటల సమయానికి కేరళలో సుమారు 75శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు క్యూలైన్లలో అధిక సంఖ్యలో కనిపించారు. క్యూలో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం లభిస్తుంది. అందుకే పోలింగ్ శాతం ఎనభై శాతం వరకూ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి .కేరళలో ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీ కనిపించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్, మెట్రో మ్యాన్ ఈ.శ్రీధరన్ వంటి ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్కడక్కడా ఈవీఎంల మొరాయింపు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

అస్సాంలోని మొత్తం 126 అసెంబ్లీ నియోజకవర్గాలకు నేడు ఒకే విడతలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 84.42% భారీ ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. 2023లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జరిగిన మొదటి ఎన్నికలు కావడంతో దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ తన కుటుంబంతో కలిసి జలుక్‌బరీలో ఓటు వేయగా, కాంగ్రెస్ నేత గౌరవ్ గొగొయ్ జోర్హాట్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్కడక్కడా ఈవీఎంల మొరాయింపు, ఒకచోట పోలింగ్ కేంద్రం లోపల వీడియో తీసినందుకు ఎఫ్ఐఆర్ నమోదు కావడం వంటి చిన్న చిన్న సంఘటనలు మినహా, 31,490 కేంద్రాల్లో పోలింగ్ సజావుగా సాగింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే హ్యాట్రిక్ విజయం కోసం చూస్తుండగా, పదేళ్ల తర్వాత అధికారాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ కూటమి గట్టిగా పోరాడుతోంది. ఈ ఎన్నికల ఫలితాలు మే 4వ తేదీన వెలువడనున్నాయి.

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని మొత్తం 30 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటల సమయానికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 82.35% భారీ ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఉదయం నుంచే ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు, ముఖ్యంగా మహిళా ఓటర్లు , యువత అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్ఆర్ కాంగ్రెస్‌బీజేపీ కూటమి , కాంగ్రెస్‌డీఎంకే కూటమిల మధ్య ప్రధాన పోటీ నెలకొన్న ఈ ఎన్నికలలో, అక్కడక్కడా ఈవీఎంల సాంకేతిక సమస్యలు మినహా పోలింగ్ ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా సాగింది. మాజీ ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి, ఇతర రాజకీయ ప్రముఖులు తమ నియోజకవర్గాల్లో ఓటు వేశారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సాగిన ఈ ఎన్నికల ఫలితాలు మే 4వ తేదీన వెలువడనున్నాయి.

## డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. దీనికి ప్రతిచర్యగా, ఇరాన్ మద్దతు ఉన్న గ్రూపులు సౌదీ అరేబియా, యూఏఈ వంటి గల్ఫ్ దేశాల మౌలిక సదుపాయాలపై డ్రోన్, క్షిపణి దాడులతో ప్రారంభించాయి. ఉత్తర్ ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ దాడులు కూడా పునః ప్రారంభం కావడంతో యుద్ధం వాతావరణం మళ్లీ వేడెక్కింది. 2026 ఏప్రిల్ 9వ తేదీ నాటికి ఈ విరమణ ఒప్పంద బ్రేక్ అయ్యే పరిస్థితికి వచ్చింది. ఈ ఒప్పందం విఫలమవ్వడానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి తన సైనిక చర్యలు కేవలం హెజ్బొల్లాపైనేనని, అవి ఇరాన్‌తో కుదిరిన ఒప్పందంతో సంబంధం లేనివని వాదిస్తోంది. కానీ, ఈ ఒప్పందం అన్ని ఫ్రంట్‌లకు వర్తించాలని ఇరాన్, మధ్యవర్తులు వాదిస్తున్నారు. ఇరాన్ తన యురేనియం శుద్ధిని వదులుకోవడానికి నిరాకరిస్తుండగా, అమెరికా మాత్రం ఇరాన్ అణు కార్యక్రమాలపై కఠినమైన పరిమితులు విధించాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన స్ట్రెయిట్ ఆఫ్ హర్మూజ్ ప్రాంతంలో ఇరాన్ తన పట్టు బిగిస్తోంది. నౌకల రాకపోకలను పర్యవేక్షించడం, పరిమితం చేయడం ద్వారా అంతర్జాతీయ సమాజంపై ఇరాన్ ఒత్తిడి పెంచుతోంది. ఈ ప్రాంతంపై ఇరాన్ నియంత్రణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చమురు శాఖాధికారి ఇప్పటికే హెచ్చరించారు. ఈ ఉద్రిక్తతల మధ్య అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ ఒప్పందాన్ని పూర్తిగా పాటించకపోతే, గతంలో కంటే అత్యంత భారీ, శక్తిమంతమైన సైనిక చర్యను అమెరికా చేపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌లోని కీలక మౌలిక సదుపాయాలు, విద్యుత్ ప్లాంట్లు , వంతెనలను లక్ష్యంగా చేసుకొనే అవకాశం ఉందని ఆయన పేర్కొనడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ఒత్తిడి పెంచితే తప్ప శత్రువులు లొంగరని ఆయన తన పోస్ట్‌లో వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం విఫలం కావడానికి మరో ప్రధాన కారణం రెండు దేశాల నేతలు దీనిని స్వదేశీ రాజకీయ అవసరాల కోసం ఒక విజయంగా చిత్రీకరించుకోవడం. దీని వల్ల చర్చల సమయంలో పట్టువిడుపులు ప్రదర్శించడానికి రాజకీయంగా అవకాశం లేకుండా పోయింది. రాబోయే రోజుల్లో అమెరికా, ఇరాన్ అధికారుల మధ్య మరిన్ని దౌత్య చర్చలు జరగాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న దాడులు, దేశాల మధ్య పెరుగుతున్న అవిశ్వాసం చూస్తుంటే, ఈ కాల్పుల విరమణ ఒప్పందం ఎప్పుడైనా కుప్పకూలిపోయే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియా మళ్లీ పూర్తి స్థాయి యుద్ధంలోకి జారిపోతే అది కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక, భద్రతా వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

## మాటలతో హామీల అమలు

✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 9 :

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు గడుస్తున్న తరుణంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర ప్రధాన హామీల అమలు తీరుపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పెళ్లైన మూడు నెలలకే బిడ్డ పుడతారా అంటూ హామీల అమలుకు సమయం కావాలని కోరుతున్నప్పటికీ, సామాన్య ప్రజానీకం మాత్రం ఫలితాల కోసం వేచి చూస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలులోకి తెచ్చింది. ఇవి క్షేత్రస్థాయిలో ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాయి. అలాగే, గ్యాస్ సిలిండర్లను రూ. 500 కే అందించే పథకం కూడా లబ్ధిదారులకు అందుతోంది. అయితే, ఇవి కేవలం ఆరు గ్యారంటీలలోని ఒక భాగం మాత్రమే. అత్యంత కీలకమైన మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 నగదు బదిలీ హామీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీనిపై కోట్లాది మంది మహిళలు ఆశలు పెట్టుకున్నారు. అలాగే, రైతులకు ఇస్తామన్న రూ. 15,000 రైతు భరోసా పంపిణీలో కూడా జాప్యం జరుగుతోంది. పాత బకాయిలు తీర్చడానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో, కొత్తగా పెంచిన మొత్తాన్ని ఎప్పుడు ఇస్తారనే దానిపై స్పష్టత కరువైంది. యువతకు ఇస్తామన్న యువ వికాసం కార్డులు, నిరుద్యోగ భృతి వంటివి కూడా ఇంకా చర్చల దశలోనే ఉన్నాయి. అతి పెద్ద సవాల్ పెన్షన్ల పెంపు. వృద్ధులకు, ఒంటరి మహిళలకు సహా అనేక వర్గాలకు ఇస్తున్న పెన్షన్లను భారీగా పెంచుతామని రేవంత్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు.కానీ ఇప్పటి వరూక అమలు కాలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచుగా గత ప్రభుత్వం వదిలి వెళ్లిన 7 లక్షల కోట్ల అప్పుల గురించి ప్రస్తావిస్తూ, ఖజానా ఖాళీగా ఉండటం వల్లే హామీల అమలులో జాప్యం జరుగుతోందని వివరిస్తున్నారు. సంక్షేమ పథకాలకు నిధులు సర్దుబాటు చేయడం కోసం ప్రభుత్వం కొత్త అప్పులు చేయాల్సి రావడం లేదా ఇతర అభివృద్ధి పనులకు నిధులు కోత విధించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడు ఆరు నెలల నుండి ఏడాది లోపు కనీస మార్పును ఆశిస్తారు. ముఖ్యంగా మధ్య తరగతి, గ్రామీణ ఓటర్లు కేవలం వివరణల కంటే, తమ ఖాతాల్లోకి వచ్చే నగదు లేదా తమ బతుకుల్లో వచ్చే మార్పునే గమనిస్తారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వాక్చాతుర్యంతో ఎంతకాలం నెట్టుకొస్తుందో కానీ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి హామీల అమలులో పురోగతి చూపకపోతే అది పార్టీకి నష్టం చేకూర్చవచ్చు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల మేనిఫెస్టో అనేది ఒక పవిత్రమైన పత్రం. దానిని కేవలం ఓట్లు దండుకోవడానికి ఉపయోగించే కాగితం గా కాకుండా, ప్రజలతో చేసుకున్న ఒప్పందంగా భావించాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వివరణలను పక్కన పెట్టి, ఆర్థిక వనరులను సమకూర్చుకుని మిగిలిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, మరో అవకాశం ఇస్తాం అని చెప్పే లోపే ప్రజల నుంచి గట్టి ప్రతిఘటన ఎదురయ్యే ప్రమాదం ఉంది.

# మతమా... విశ్వాసమా...

“ దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తున్న శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టులో కీలక విచారణ కొనసాగుతోంది. 'శబరిమలలో స్త్రీల ప్రవేశం' అంశంపై జరుగుతున్న విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.



మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో, కాదో నిర్ణయించే అధికారం, హక్కు న్యాయస్థానానికి ఉందని పేర్కొంది. న్యాయమూర్తులు చట్టం విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదు. కాబట్టి న్యాయస్థానాలు మత ఆచారాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేవు' అన్న కేంద్ర ప్రభుత్వ వాదనకు ప్రతిస్పందనగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసిందిసుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో, 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం శబరిమల కేసును విచారణ చేస్తోంది. ఈ ధర్మాసనంలో జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ ఉన్నారు. ఈ బెంచ్ ఆధ్వర్యంలో కేరళలోని శబరిమల ఆలయంతో సహా, వివిధ మత ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై, అలాగే వివిధ మతాల్లో ఉన్నస్త్రీ మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరుగుతోంది కేరళలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల వేళ ఈ విచారణ రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ధర్మాసనంలో జస్టిస్‌లు బీవీ నాగరత్నం, ఎంఎం సుందరేష్, అహసానుద్దీన్ అమానుల్లా సహా తొమ్మిది మంది న్యాయమూర్తులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు బలంగా వినిపించారు. శబరిమల ఆలయానికి సంబంధించి మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలు పూర్తిగా మతపరమైన విశ్వాసాలకు సంబంధించినవని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 25వ అధికరణం కల్పించిన మత స్వేచ్ఛను ప్రస్తావిస్తూ మతపరమైన ఆచారాలు ప్రజలకు భావాలకు, నైతికత, ఆరోగ్యం, వంటి అంశాలకు భంగం కలిగించినప్పుడు మాత్రమే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలని ఆయన వాదించారు.

మతపరమైన గ్రంథాలను అర్థం చేసుకోవడం, అవి ఏవీ నిర్దేశిస్తున్నయో నిర్ణయించడం న్యాయసమీక్ష పరిధిలోకి రాదని, దీనికి ఆధ్యాత్మిక మతపరమైన ఆచారం అనేది నిర్ణయించడానికి న్యాయస్థానాలు ప్రయత్నించడం సరైనది కాదని ఆయన వాదించారు. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, "ఒక ఆచారం మూఢనమ్మకమని కోర్టు ఎలా నిర్ణయిస్తుంది? ఒక వేళ అది మూఢనమ్మకమని భావించినప్పటికీ, దానిని నిర్ధరించాల్సింది కోర్టు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(2)(బి) ప్రకారం చట్టసభలు (లెజిస్లేచర్) మాత్రమే సంస్కరణ (రిఫార్మ్ లా) చట్టాలను తీసుకురావాల్సి ఉంటుంది. ఎలా అంటే, ఒక నిర్దిష్ట ఆచారం మూఢనమ్మకం అని, దానికి సంస్కరణ అవసరమని శాసనసభలు చెప్పవచ్చు. చేతబడి లాంటి ఆచారాలను నిరోధించడానికి ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు.2018 నాటి శబరిమల తీర్పులో మహిళల ప్రవేశానికి అస్పృశ్యత కిందకు వస్తుందని అప్పటి ధర్మాసనం చేసిన వ్యాఖ్యలపై తుషార్ మెహతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ, ఒక మహిళను నెలలో మూడు రోజులు అంటరాని వ్యక్తిగా చూసి, నాలుగో రోజు ఆమె అస్పృశ్యురాలు కాదని చెప్పడం సాధ్యమేనా అని ప్రశ్నించారు.

అయితే మెహతా దీనికి సమాధానం ఇస్తూ శబరిమల విషయంలో ఆంక్షలు కేవలం వయసు ఆధారంగానే ఉన్నాయని, ఇది రుతక్రమంతో ముడిపడి లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ఇతర అయ్యప్పస్వామి దేవాలయాల్లో ఇన్ని వయసుల మహిళలకు ప్రవేశం ఉందని, శబరిమల విషయంలో ఉన్న ఆంక్షలు ఒక ప్రత్యేక సందర్భం అని ఆయన వివరించారు. ఒక వేళ ఏదైనా అశాస్త్రీయమైన ఆచారం ఉంటే, దానిని పరిష్కరించే బాధ్యత శాసనసభలకే ఉంటుందని కేంద్రం వాదించింది. దీనిపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ, న్యాయస్థానాలు సైన్స్ రంగంలో నిపుణులు కాకపోయినప్పటికీ, ఎవిడెన్స్ యాక్ట్ ప్రకారం నిపుణులు అభిప్రాయాలను సమీక్షించే అధికారం కోర్టులకు ఉంటుందని పేర్కొన్నారు. ఒక సామాజిక రుగ్మతను మతపరమైన ఆచారంగా ముద్రవేసినప్పుడు అది నిజంగా మతపరమైన అచారామా లేక సామాజిక దురాచారమా అని చెప్పే హక్కు కోర్టుకు ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. భారతీయ సమాజం మహిళలను ఎప్పుడూ గౌరప్రదమైన స్థానంలో ఉంచిందని, మనం దేవతలను పూజిస్తామని మెహతా ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రపతి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వరకు మహిళలు అత్యున్నత పదవులను అలంకరించారని, కాబట్టి ఇక్కడ పితృస్వామ్య భావజాలాన్ని ఆపాదించవద్దని ఆయన కోరారు. 2018 సెప్టెంబర్లో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. మహిళ ప్రవేశంపై నిషేధం ఉండడం రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొంది. ఆ తర్వాత 2019 నవంబర్ 14న అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం 3:2 మెజారిటీతో ఈ అంశాన్ని 9 మంది సభ్యులుగల అత్యున్నత ధర్మాసనానికి బదిలీ చేసింది.ఈ విచారణలో సుప్రీంకోర్టు కేవలం శబరిమల తీర్పు మెరిట్‌లను మాత్రమే కాకుండా, మతపరమైన స్థలాల్లో మహిళలపై వివక్షకు సంబంధించి రూపొందించిన ఏడు కీలక ప్రశ్నలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేసింది.

## వేగంగా ఫ్యూచర్ సిటీ అడుగులు

గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) చెన్నై ధర్మాసనం.. ఊరట కల్పించింది. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు నిర్మాణంపై దాఖలైన పిటిషన్‌పై స్టే ఇచ్చేందుకు ఎన్జీటీ చెన్నై బెంచ్ నిరాకరించింది. దీంతో రేవంత్ రెడ్డి సర్కార్‌కు రిలీఫ్ కలిగింది. ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నోటిఫికేషన్2006లో వెల్లడించిన ప్రకారం.. పర్యావరణ అనుమతులు లేకుండానే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని.. హైదరాబాద్ కొంపల్లికి చెందిన డాక్టర్ దొంతి నర్సింహా రెడ్డి.. ఎన్జీటీలో పిటిషన్ వేయగా.. తాజాగా విచారణ జరిపింది. దాదాపు 30 వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును నిర్మించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు నిర్మాణంపై స్టే విధించాలని పిటిషనర్ డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి కోరారు. అదే సమయంలో పర్యావరణ అనుమతులు లేకుండా ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు అభివృద్ధి పనులు చేపట్టడం చట్ట విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఇక ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించి.. ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు గానీ, అభివృద్ధి కార్యక్రమాలు గానీ ప్రారంభించలేదని ప్రభుత్వం తరఫు లాయర్ వివరించారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో చట్టవిరుద్ధంగా.. నిబంధనలను అతిక్రమించి.. ఎలాంటి పనులు చేపట్టబోమని హామీ ఇచ్చారు.

ఇక త్వరలోనే పర్యావరణంతోపాటు అన్ని రకాల అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇరు వైపులా వాదనలు విన్న చెన్నై ఎన్జీటీ బెంచ్.. ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ఇంకా ప్రారంభం కానందున అనుమతులు తీసుకునేందుకు ఇంకా సమయం ఉందని పేర్కొంటూ.. దీనిపై స్టే ఇచ్చేందుకు నో చెప్పింది. ఇక పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను జూన్ 9వ తేదీకి వాయిదా వేసింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ మీదుగా ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఓఆర్ఆర్ కొంగరకలాన్ నుంచి ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి వద్ద రీజినల్ రింగు రోడ్డు వరకు ఈ ప్రాజెక్టును చేపట్టారు. అయితే ఈ కొత్త రహదారి నిర్మాణం చుట్టూ న్యాయవివాదాలు ముసురుకుంటున్నాయి. ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూసేకరణ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రోడ్డు నిర్మాణ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారంటూ 30 మంది రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. యాచారం మండలం కుర్మిద్ద, కడ్తాల్ మండలం కడ్తాల్, ముద్విన్, ఆమన్‌గల్ మండలం ఆకుతోటపల్లి గ్రామాల్లో మొత్తం 554.34 ఎకరాల సేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. అయితే.. భూసేకరణ, పునరావాసం చట్టం2013లో పేర్కొన్న తప్పనిసరి నిబంధనలను అధికారులు తుంగలో తొక్కారని వారు ఆరోపించారు. ముఖ్యంగా నిర్వాసిత రైతుల నుంచి అభ్యంతరాలను తీసుకోవాల్సి ఉండగా.. ఆ ప్రక్రియను మొక్కుబడిగా పూర్తి చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. తమ అభ్యంతరాలను అకారణంగా తిరస్కరించారని ఇది చట్టవిరుద్ధమని, ఏకపక్షమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 61.24 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ భూముల నుంచి తమను బలవంతంగా ఖాళీ చేయించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ పిటిషన్‌పై విచారణ జరిపి వాస్తవ పరిస్థితులపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మొత్తం 554.34 ఎకరాల్లో సుమారు 200 ఎకరాల భూమి వివాదంలో ఉందని.. మిగిలిన భూమికి సంబంధించి 26 ఎకరాలకు ఇప్పటికే పరిహారం అవార్డులు జారీ చేశామని వెల్లడించారు. ప్రాజెక్టు ప్రాముఖ్యత దృష్ట్యా భూసేకరణపై స్టే ఇవ్వవద్దని ఆయన కోర్టును కోరారు. అలాగే.. రైతులకు పరిహారం చెల్లించే వరకు వారిని భూముల నుంచి ఖాళీ చేయించబోమని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు. ఈ హామీని పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. తదుపరి విచారణను సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

## తండ్రి జోక్యం ఎక్కువైందని చీవాట్లు

సమావేశమయ్యారు. ఈ సమావేశంలోనే మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఆయన తండ్రి జోక్యం అధికార కార్యక్రమాల్లో ఎక్కువగా ఉంటోందనే ఆరోపణలను గుర్తు చేసి జాగ్రత్తపడాలని సూచించారు. విజయనగరం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులతో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను వారి ముందు పెట్టారు. అందులో భాగంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ అరంగేట్రంతోనే ఎమ్మెల్యేగా గెలిచావని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తొలిసారి విజయం సాధించిన వెంటనే మంత్రిగా జాక్‌పాట్ కొట్టావని, మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికార వ్యవహారాల్లో శ్రీవాస్ తండ్రి జోక్యం ఎక్కువైందని ఆయన్ని దూరం పెట్టాలని గతంలోనే సూచించినట్టు చెప్పుకొచ్చారు. అయినా ఇంకా పరిస్థితిలో మార్పు రాలేదని అసహనం వ్యక్తం చేశారు. పార్టీకి కంచుకోటలాంటి జిల్లాలో వ్యక్తిగతంగా, పార్టీపరంగా ప్రగతి చూపాలని సూచించారు. అందరినీ కలుపుకొని ముందుకెళ్లాలని కొండపల్లికి సీఎం హితవుపలికారు.

చంద్రబాబు చేసిన కామెంట్స్‌పై మంత్రి శ్రీనివాస్ స్పందించారు. ఆరు నెలలుగా ఏ వ్యవహారంలోనూ తన తండ్రి జోక్యం చేసుకోవడం లేదని బదులిచ్చారు. అయితే తన వద్ద పూర్తి రిపోర్ట్ ఉందని ఏం చేస్తున్నారో తెలుసు అని చెప్పేసరికి శ్రీనివాస్ సైలెంట్ అయిపోయారు. జిల్లా నేతలతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు భిన్నమైన పంథాను అనుసరిస్తున్నారు. ముందుగా ఆ జిల్లాలో చేపడుతున్న పనులు, పెండింగ్‌లో పన్నులు, ప్రభుత్వ పథకాలపై చర్చిస్తున్నారు. అనంతరం ఒక్కో ఎమ్మెల్యేకు, ఎంపీ, మంత్రికి సంబంధించిన ఫైల్స్ బయటకు తీస్తున్నారు. వారి పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు. రెండు రోజుల క్రితం శ్రీకాకుళం జిల్లా 8 మంది ప్రజాప్రతినిధులు సీఎంతో సమావేశమయ్యారు. వారిలో కొందరు కూటమి నేతలను కలుపుకొని వెళ్లడం లేదని క్లాస్ తీసుకున్నారు. కొందరికి ప్రజల్లో మంచి పేరు ఉందని దాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు. మరి కొందరపై నెగటివ్ అభిప్రాయం ఉందని మార్చుకోవాలని చెప్పారు. ఇలా ఎమ్మెల్యే ప్రొగ్రెస్ రిపోర్ట్ వారికి తెలియజేసి సమస్యలను అడ్రస్ చేస్తున్నారు.

## ఈవీ చార్జింగ్ స్టేషన్లు

ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు గడువు విధించుకున్నారు. ఈ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి వస్తే నగరంలోని వివిధ రూట్లలో ఎలక్ట్రిక్ బస్సుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం.. రానున్న రెండేళ్లలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కేవలం ఎలక్ట్రిక్ బస్సులను మాత్రమే నడపాలని డిసైడ్ అయ్యారు. దీనివల్ల నగరంలో కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం గ్రేటర్ జోన్ పరిధిలో 490 ఎలక్ట్రిక్ బస్సులు వివిధ డిపోల నుంచి విజయవంతంగా రాకపోకలు సాగిస్తున్నాయి. విడతలవారీగా కొత్త బస్సులు రోడ్డుపైకి రానున్నాయని.. అందుకు అనుగుణంగా ఛార్జింగ్ పాయింట్ల సంఖ్యను కూడా పెంచుతున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.కేవలం బస్సుల సంఖ్యను పెంచడమే కాకుండా.. ఛార్జింగ్ స్టేషన్ల వద్ద అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఫాస్ట్ ఛార్జింగ్ సౌకర్యాల వల్ల బస్సుల వెయిటింగ్ టైమ్ తగ్గి, మెరుగైన సేవలందించడానికి వీలవుతుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఈ మెగా ప్రాజెక్ట్ పూర్తయితే హైదరాబాద్ దేశంలోనే అత్యధిక ఎలక్ట్రిక్ ప్రజా రవాణా వ్యవస్థ కలిగిన నగరాల్లో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. నగరవాసులకు కాలుష్య రహిత, సుఖవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని చెబుతున్నారు.

# మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల నుంచి సిఇసి గ్రూప్ ని మార్చకూడదు

- సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో దేవరకొండ మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల మరియు కొండమల్లేపల్లి మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల నుండి సి ఇ సి గ్రూపును వేరే పాఠశాలకు మార్చవద్దని సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో మొత్తం 83 పాఠశాలల నుంచి సీ ఇ సీ గ్రూపును తీసి వేరే పాఠశాలకు మార్చడం సరైనది కాదని అన్నారు. ప్రభుత్వం బీసీ విద్యార్థులు చదువుకోవడానికి మారుమూల పట్టణ ప్రాంతాల్లో మహాత్మ జ్యోతిబా పూలే పేరిట గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తే దీనిలో కొన్ని డిమాండ్ ఉన్న గ్రూప్ లని కొన్ని డిమాండ్ లేని గ్రూపులోని చెబుతూ డిమాండ్లను గ్రూపులను వేరే పాఠశాలకు మార్చుతూ ఆ ప్రాంతంలో ఉన్నటువంటి వీర విద్యార్థులకు నష్టం కలిగేటటువంటి అవకాశం ఏర్పడుతుంది దీనివలన విద్యార్థులు మానసికంగా ఇబ్బందులకు గురి అవుతారు ఇట్టి విషయాన్ని ఈ ప్రాంతంలో ఉన్నటువంటి విద్యార్థుల యొక్క తల్లి దండ్రులు మా దృష్టికి తీసుకురాగా ఇట్టి విషయాన్ని ఎంపీ రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణ గారికి శర్వాణిలో సమాచారం అందించిన తక్షణమే అన్ని గ్రూపులను సమానంగా చూస్తే ప్రాంతంలో ఉన్నటువంటి విద్యార్థులు చదువుకు దూరం చేయకుండా ప్రోత్సహించే విధంగా మేధావిధిగా గ్రూపులను ఉంచాలి లేని సంవత్సరంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేసి గ్రూపు యధావిధిగా వచ్చే విధంగా కార్యక్రమాలు చేస్తూ సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, పేరికేటి శ్రీనివాస్ చారి ,పున్న భిక్షమయ్య, యాదయ్య చారి, శివ తదితరులు పాల్గొన్నారు.



## షిరిడిలో బీర్ల శివమణి జన్మదినోత్సవం

జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 09 :

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గురువారం షిరిడి సాయిబాబాను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సాయిబాబాకు ప్రీతిపాత్రమైన గురువారం రోజున బీర్ల అయిలయ్యఅనిత దంపతులు తమ కుమారుడు బీర్ల శివమణి పుట్టినరోజు షిరిడీలో జరుపుకోవాలని కుటుంబ సమేతంగా భావించి వెళ్లారు.

## బాధితుడికి సరోజ్ రెడ్డి ఆర్థిక సహాయం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింత కుంట మండలం అమ్మాపూర్ లో పక్షవాతంతో బాధపడుతున్న పల్లెపు రమేష్ కు హైకోర్టు న్యాయవాది, దేవరకద్ర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి గురువారం రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గత కొన్ని రోజులుగా పల్లెపు రమేష్ పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సరోజ్ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి ఆయనకు పరామర్శించి ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ ధరలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు గురువారం 993 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ ధాన్యాన్ని రైతుల విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి క్వింటాల్ కు అత్యధికంగా రూ. 2239 ధర పలికింది అలాగే అతి తక్కువగా రూ.2125 ధర పలికింది.156 క్వింటాళ్ల హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి క్వింటాల్ కు అత్యధికంగా రూ. 1783 ధర పలికింది. అతి తక్కువగా రూ.1729 ధర పలికింది.55 క్వింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి క్వింటాల్ కు అత్యధికంగా రూపాయలు రూ.6103 ధర పలికి. అలాగే అతి తక్కువగా రూ. 6053 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## మృతురాలి కుటుంబ సభ్యులు పరామర్శించిన హైకోర్టు న్యాయవాది




జయభేరి, దేవరకద్ర :


మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం హస్నాపూర్ లో గురువారం రాచమోని శంకర్ తల్లి చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న హైకోర్టు న్యాయవాది, దేవరకద్ర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు.

## దామెర బండ్ పునరుద్ధరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి



జయభేరి, పరకాల, ఏప్రిల్ 09:

గురువారం పరకాల పట్టణ కేంద్రంలో రూ 3.14 కోట్లతో చేపట్టనున్న దామెర బండ్ పునరుద్ధరణ పనులను అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దామెర బండ్‌ను ఆధునికంగా బ్యూటిఫికేషన్ చేసి ప్రజలకు ఆకర్షణీయ ప్రదేశంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే లక్ష్యంతో చెరువును అభివృద్ధి చేస్తామని, అలాగే చెరువు చుట్టూ రింగ్ బండ్ ఏర్పాటు చేసి, ప్రజలకు సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయ్యాక పరకాల పట్టణానికి ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు ప్రజలకు విశ్రాంతి, వినోదానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు.



## 12న బిజ్వార్ లో గోమాత కళ్యాణ మహోత్సవం

- ముస్తాబైన అంబాత్రక్ష క్షేత్రం
- శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరా శ్రీ గురుస్వామి ఆధ్వర్యంలో

జయభేరి, దేవరకద్ర :

నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని బిజ్వార్ లోని అంబాత్రయ క్షేత్రంలో ఈనెల 12న 6వ గోమాత కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్షేత్ర వ్యవస్థాపకుడు శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి లక్ష్మీ కుంకుమ సౌభాగ్యవతి వధువు గోమాత రేణుక ఎల్లమ్మతో వరుడు చిరంజీవి వృషభం శ్రీ జమదగ్ని మహామునితో ఈ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 12 గంటల 28 నిమిషాలకు ఈ కళ్యాణ మహోత్సవాన్ని అంబాత్రాయ క్షేత్రంలో కనుల పండువగ నిర్వహించనున్నారు. కావున భక్తులందరూ అధిక సంఖ్యలో వచ్చి ఈ పవిత్ర కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని అంబాత్రక్ష క్షేత్ర నిర్వాహకులు శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ గురువు కోరారు.

## విద్యార్థుల హక్కుల సాధనలో అగ్రగామిగా నిలిచిన ఎన్ఎస్ యు ఐ



జయభేరి, దేవరకద్ర :

విద్యార్థుల హక్కుల సాధనలో ఎన్ఎస్ యు ఐ అగ్రగామిగా నిలిచిందని జి కే ఆర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జి.కోన రాజశేఖర్ అన్నారు. నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు, విద్యార్థులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# చంద్ర రాజేశ్వర రావుకు సీపీఐ ఘన నివాళి

జయభేరి, యాదగిరిగుట్ట :



కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్ రావు 32వ వర్ధంతి పురస్కరించుకొని గురువారం సిపిఐ పార్టీ కార్యాలయం వద్ద 32వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ పోరాటాల యోధుడు చంద్ర రాజేశ్వరరావు సిఆర్అని అన్నారు. విద్యార్థి దశ నుండే ప్రజలకు స్వేచ్ఛ, స్వతంత్రం ఉండాలని సమానత్వం, న్యాయం కోసం అనునిత్యం ఆయన పోరాటాలు నిర్వహించాలని అన్నారు. భారతదేశ స్వతంత్రం కోసం, పేద ప్రజల కోసం తన జీవితాంతం పోరాటం చేసి, తన యావదాస్తిని పేద ప్రజలకు వంచిన మహోన్నతమైన నాయకుడు సిఆర్అని ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ,సిపిఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్,మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన వెంటయ్య, పట్టణ సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, కార్యవర్గ సభ్యులు కోక్కల రవీందర్, గుండు వెంకటేష్, మాటూరీ మల్లయ్య, సిపిఐ నాయకులు విజయలక్ష్మి, కంబాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు పూర్తి చేయడమే లక్ష్యం

- కౌన్సిలర్ యమున శ్యామ్

జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 9:



అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 9 వార్డ్ లో పెండింగ్ లో ఉన్న పనులపై కౌన్సిలర్ యమునా శ్యామ్ దృష్టి సారించారు. ఇందులో భాగంగా మున్సిపల్ పరిధిలోని 9 వ వార్డులో గత కొంతకాలంగా పెండింగ్ లో వున్న డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరు అంతా రహదారులపై ప్రవహిస్తుంది. దీంతో దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే వీరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కౌన్సిలర్ యమున శ్యామ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు . అనంతరం వారు మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారి సమస్యలు దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం దిశగా ఈ పనులు చేపట్టినట్లు వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలు మాట్లాడుతూ గత కొంత కాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కౌన్సిలర్ ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ పనులు పూర్తి అయితే తమకు ఎంతో ఉపశమనం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు గట్టు హరిశంకర్ , తుమ్మ గోపాల్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికే అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి
- స్మార్ట్ ఫోన్లతో అంగన్వాడీ సేవల్లో పారదర్శకత
- అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్స్ పంపిణీ కార్యక్రమలో ఎమ్మెల్యే వ్యాఖ్య

జయభేరి, పరకాల ఏప్రిల్ 09:




గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్ మరియు పరకాల, దామెర, ఆత్మకూరు, నడి కూడా మండలాల పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో స్మార్ట్ ఫోన్ల వినియోగం ద్వారా ప్రజలకు పారదర్శకంగా అంగన్వాడి సేవలు అందుతాయని అన్నారు. పరకాల ప్రాజెక్ట్ పరిధిలో 165 మందికి స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశామన్నారు. ఐసిడిఎస్ ద్వారా గర్భిణి స్త్రీలకు, బాలింతలకు, 06 సంవత్సరాల పిల్లలకు,6 రకాల సేవలు అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. గర్భిణీలు, బాలింతల చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ఆన్లైన్లో నమోదు చేయడానికి మొబైల్ ఫోన్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తుంది అన్నారు.


# కవిత, షర్మిలకు బంగారం వంటి అవకాశాలు

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 9 :**



రాజకీయాల్లో అవకాశాలు రావాలి. కాలం కలిసొస్తే మంత్రి పదవి కూడా చేపట్టకుండా కనీసం ఎమ్మెల్యే కూడా కాకుండా ముఖ్యమంత్రి అయిపోవచ్చు. ఎంపీ కాకుండానే ప్రధాని పదవిలో కూర్చోవచ్చు. ఇవన్నీ ఈ దేశంలో జరిగాయి. ఇక తెలుగు రాజకీయాల్లో చూస్తే ఇప్పటిదాకా పురుషాధిపత్యం సాగుతోంది. మహిళా రాజకీయ నాయకురాళ్ళు ఉన్నారు కానీ వారు ద్వితీయ స్థానాలకే పరిమితం అవుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు ప్రముఖ రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వైఎస్ షర్మిల, కల్వకుంట్ల కవిత ఇద్దరూ తమ రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ ఇద్దరూ సొంత కుటుంబాలను వ్యతిరేకిస్తూ సొంత రాజకీయం చేస్తున్నారు. ఇందులో షర్మిల అయితే తెలంగాణాలో వైఎస్సార్ టీపీని స్థాపించి కొన్నాళ్ళు అక్కడ రాజకీయం చేశారు. చివరికి ఆ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసి 2024 ఎన్నికల ముందు ఏపీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అయ్యారు. ఆమె తానుగా గెలవకపోయినా వైసీపీని ఓడించారు. దాంతో పాటు వైసీపీకి రాయలసీమలో పెద్ద దెబ్బ తగిలి ఏకంగా విపక్ష స్థానానికి సైతం సరిపడా సీట్లు దక్కకుండా 11 సీట్లకే పరిమితమై చతికిలపడింది. ఇక ఏపీ కాంగ్రెస్ కి ఆమె ప్రెసిడెంట్ గా తనదైన శైలిలో పనిచేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఓటు బ్యాంక్ అంతా కాంగ్రెస్ దే కావడం దాని అధినేత జగన్ కావడంతో వైఎస్సార్ వారసురాలిగా షర్మిలను పీసీసీ పీఠం మీద ఉంచితే ఎంతో కొంత కాంగ్రెస్ కి ఓటు బ్యాంక్ దక్కుతుందన్న ఆలోచనలో కాంగ్రెస్ పెద్దలు జాతీయ స్థాయిలో ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఈ క్రమంలో ఏపీలో అదనంగా మరో యాభై శాతం సీట్లు పెరుగుతాయని అంటున్నారు. అంతే కాదు మొత్తం సీట్లలో మూడవ వంతు మహిళలకు రిజర్వేషన్ అంటున్నారు.

అంటే ఏపీలో 263 సీట్లు పెరిగితే అందులో 88 సీట్ల దాకా విమెన్ రిజర్వేషన్ కిందకు వస్తుంది. ఈ సీట్లలో పోటీ చేయడానికి మహిళా నాయకురాళ్ళు రెడీగా ఉండాల్సిందే. ఇప్పటికే కీలకమైన స్థానాల్లో ఉన్న వారికి ఈ సీట్ల పెరుగుదల రిజర్వేషన్లు అన్నవి అతి పెద్ద బూస్టింగ్ గా అని చెబుతున్నారు. మరీ ముఖ్యంగా కడప జిల్లాలో పది సీట్లు పదిహేను అవుతాయని అంటున్నారు. అయిదు సీట్లు మహిళలకు దక్కుతాయి. కడప అంటే వైఎస్సార్ ఫ్యామిలీకి కంచుకోట. 2024 లో కడప ఎంపీ సీటుకు షర్మిల పోటీ చేశారు. లక్షన్నర ఓట్లు తెచ్చుకున్నారు. ఇపుడు పెద్ద నియోజకవర్గాలు చిన్నవిగా మారితే మహిళా రిజర్వేషన్లు అయితే షర్మిలకు కుటుంబ నేపథ్యం, రాజకీయంగా పరిస్థితులు అనుకూలించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఆమె మీద బలమైన అభ్యర్థులను ప్రత్యర్థులు వెతకాల్సి ఉంటుంది. లేకపోతే స్టేట్ వైడ్ లీడర్ గా ఉన్న షర్మిల జాగ్రత్తగా చేసుకుంటే గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టడం కష్టం కాబోదు అని అంటున్నారు. కవిత తెలంగాణాలో కొత్త పార్టీని స్థాపించబోతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో కొత్తగా సీట్లు పెరగడం చిన్న అసెంబ్లీ నియోజక వర్గాలుగా మారడం కలిసి వచ్చే అంశమే అంటున్నారు. అక్కడ కూడా 59 దాకా సీట్లు మహిళా రిజర్వేషన్ల రూపంలో దక్కనున్నాయి. కవిత జనంలో ఉంటున్నారు తండ్రి కేసీఆర్ మాదిరిగానే ఫైర్ బ్రాండ్ గా ఉంటున్నారు. దాంతో ఆమె తనతో పాటు కొందరు మహిళా నేతలను కనుక జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటే రిజర్వ్డ్ సీట్లలో గెలుచుకోగలరని అంటున్నారు. అలాగే ఇమేజ్ ఉన్న నాయకులు ఆమె పార్టీలో చేరితే చతుర్ముఖ పోరులో చిన్న నియోజకవర్గాల్లో ఓట్లు అటు నుంచి ఇటు అయితే గెలిచే వీలు ఉంటుందని లెక్క వేస్తున్నారు. మొత్తానికి కవిత పార్టీకి ఇది శుభారంభం అని అంటున్నారు. ఏది ఏమైనా మహిళా రాజకీయ నాయకురాళ్ళుగా పట్టుదలగా పోరాడుతున్న కవిత షర్మిల రాజకీయ జాతకాన్ని మార్చే విధంగా పునర్ విభజన కానీ మహిళా రిజర్వేషన్ కానీ ఉండబోతున్నాయా అంటే వేచి చూడాల్సిందే అంటున్నారు.



## పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 09 :**

తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బద్దూ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న గేదలు, ఆవులకు గాలికుంటు వ్యాఇప్పించాలన ముందస్తుగా టీకాలు ఇప్పించాలని కోరారు .గ్రామంలో 91 పశువులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లావూరి సుమన్ నాయక్ వెటర్నరీ అసిస్టెంట్ రాఘవేంద్ర, గోపాలమిత్ర వీరు, రైతులు పాల్గొన్నారు.

## తొర్రూరులో విద్యార్థులకు కండ్లద్దాల పంపిణీ




**జయభేరి, తొర్రూరు, ఏప్రిల్ 9 :**

రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్కే)లో భాగంగా గురువారం తొర్రూరు జెడ్పీ హైస్కూల్, గుర్తూరు మోడల్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులకు ఆర్బీఎస్కే మెడికల్ ఆఫీసర్ డా. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా కండ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కంటి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో కంటి సమస్యలను తొందరగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా వారి విద్యాభ్యాసం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఎన్. నిర్మల, ఏఎన్ఎం కె. అక్షితతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్



**జయభేరి, నేరేడుగొమ్ము :**

నేరేడు గోమ్ము మండలం కచరాజపల్లి లో ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో మంజూరైన 5 లక్షల వ్యయంతో కూడిన సీసీ రోడ్డు పనులను కచరాజపల్లి సర్పంచ్ రామావత్ బాబురాం నాయక్ గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమములో ఉప సర్పంచ్ నేతల హన్మంతు, గ్రామ పెద్దలు నేతాల అంజయ్య, కొడవత్ చందు,వడ్త్యా హన్మంతు, వంకునావత్ నాతూ, వడ్త్యా బుద్దా తదితరులు పాల్గొన్నారు.

## మైనంపల్లిలో తల్లిపాల వారోత్సవాలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవరకొండ సర్పంచుల ఫోరం అధ్యక్షులు సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అదేవిధంగా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈసమావేశంలో పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, ఉపద్యాయులు జగదీష్, అంగన్వాడీ టీచర్ కమలమ్మ, ఆయా కలమ్మ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చంచల్ గూడ జైలు లో వైద్య శిబిరం

- **ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింభ**

**జయభేరి, హైదరాబాద్ :**

చంచల్ గూడ జైలులో వైద్య శిబిరాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఖైదీల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ని అన్ని జైళ్లలో ప్రతి మూడు నెలలకు వైద్య ఆరోగ్య శాఖ శిబిరాలను నిర్వహించనున్నామని ప్రకటించారు. ప్రతి ఖైదీకి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రా., హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన తదితరులు పాల్గొన్నారు.

## బీఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- **బీఎన్ ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం - జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి**

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 9:**




శామీర్ పేట డివిజన్ పరిధిలోని దేవరాయాంజాల్ గ్రామంలో బక్కోల్ల బాలమణి 8వ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుమారుడు బీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బీఎన్ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి హాజరై బాలమణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించగా వైద్యులు షఫీ, మసూద్ లు పలువురికి వైద్య, పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.




ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో సంతోషకరమని, ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిదంగా బీఎన్ రామ్మోహన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బక్కోల కళ్యాణి, రామాలయం మాజీ ధర్మకర్త పట్నం నర్సింహ రెడ్డి, బీఎన్ ఆర్ ట్రస్ట్ సభ్యులు శర్మ, పి. రమేష్, బక్కోల మదన్ మోహన్ పాల్గొన్నారు.

## నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

- **నృసింహుని సేవలో రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ కమీషనర్ హనుమంత రావు కుటుంబ సభ్యులు**

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. యాదగిరిగుట్ట ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వయం భూ నరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు మాధవ చార్యులు, సిద్ధార్థ చార్యులు,డీఈవో నవీన్ కుమార్,ఏఈఓలు శంకర్ నాయక్,మహేష్ కుమార్,సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి,రాజన్ బాబు, ఇన్స్పెక్టర్ శేషగిరిరావు, ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది నందు నాయక్, అనిల్,ఆలయ ఇంచార్జి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావు, సబితా చేతుల మీదుగా విజయలక్ష్మికి వీర నారి అవార్డు

- **అవార్డుతో మరింత సేవకు సిద్ధం: విజయలక్ష్మి**

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 9:**



హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో ఓకే టీవీ ఆధ్వర్యంలో "ఎక్సలెన్స్ అవార్డ్స్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రతిభావంతులను ఈ కార్యక్రమంలో సత్కరించారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య మాజీ మంత్రులు హరీష్ రావు మరియు సబితాఇంద్రరెడ్డిలు ముఖ్య అతిథిలుగా హాజరై అవార్డులను అందజేశారు. వారి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం పట్ల అవార్డు గ్రహీత విజయలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత విజయలక్ష్మి మాట్లాడుతూ తాము ఈ "వీర నారి అవార్డ్" అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ అవార్డు నాకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో కూడా సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని స్పష్టం చేశారు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఓకే టీవీ డైరెక్టర్ శ్రావ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి సేవ చేస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించడం ఎంతో గొప్ప విషయమని, ఇలాంటి కార్యక్రమాలు మరింతగా జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ వేడుకలో పలువురు ప్రముఖులు, సామాజిక సేవకులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఆత్మకూరు, నర్వలలో యం.పి అరుణమ్మ పర్యటన

**జయభేరి, దేవరకద్ర :**

ఆత్మకూర్, నర్వ లలో శుక్రవారం ఎంపీ డి.కే అరుణమ్మ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10:30 లకు అమృత్ భారత్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మున్సిపాలిటీలో పరమేశ్వర చెరువు సుందరీకరణ పనుల పరిశీలిస్తారు. అలాగే ఉదయం 11:30 లకు ఆత్మకూరు పట్టణంలోని మిని స్టేడియంలో ప్రెస్ మీట్ లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:30లకు అమృత్ భారత్ 2.0 కార్యక్రమంలో భాగంగా అమరచింత మున్సిపాలిటీలోని పెద్ద చెరువు సుందరీకరణ పనులకు భూమి పూజ చేస్తారు.మధ్యాహ్నం 01కు నాగిరెడ్డి పల్లి గ్రామం, నర్వ మండలంలో RO ప్లాంట్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 02:30 లకు నర్వ మండల కేంద్రంలో సిసి రోడ్లను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3:15లకు లంకాల గ్రామంలో సిసి రోడ్లు మరియు హైమాస్ట్ లైట్ల ను ప్రారంభిస్తున్నట్లు నాయకులు తెలిపారు.

## జనసేన నేత మోసం చేసాడు

- **బాధిత మహిళ వీడియో**



**జయభేరి, విజయవాడ :**

మరో జనసేన నేత రాసలీలలు బయటపడ్డాయి. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఎపిసోడ్ ఘటన మరవకముందే, తనను మోసం చేశాడంటూ మరో జనసేన నాయకుడి భాగోతం ఒక మహిళ బయట పెట్టింది. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జడ్పీటీసీ జయప్రకాష్ నాయుడు తనను ఆర్థికంగా, శారీరకంగా వాడుకుని, చిత్రహింసలు పెడుతున్నాడని వీడియో విడుదల చేసింది. తాను పవన్ కళ్యాణ్ అభిమానినని, పార్టీ కార్యక్రమాల కోసం వెళ్లినప్పుడు జయప్రకాష్ నాయుడు పరిచయమయ్యాడని, భర్త లేని నన్ను పెళ్లి చేసుకుని బాగా చూసుకుంటానని నమ్మించాడని మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కొన్ని రోజుల తర్వాత మద్యం మత్తులో, గంజాయి మత్తులో తనను చితకబాదేవాడని, తనను కూడా గంజాయి సేవించమని ఒత్తిడి చేసేవాడని బాధిత మహిళ ఆరోపించింది. తనతో ఉండనని చెప్తే, నీ ఫోటోలు, వీడియోలు ఉన్నాయని బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలంటూ కన్నీరు పెట్టుకుంటూ వీడియో విడుదల చేసింది.

# భూభారతి ఇంటిగ్రేటెడ్ పోర్టల్ రెడీ

జయభేరి, నిజామాబాద్ ఏప్రిల్ 9 :




భూముల సమస్యలు రాకుండా ఉండేందుకు రేవంత్ సర్కార్ భూభారతి పోర్టల్ ద్వారా పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేసేందుకు రెడీ అయింది. భూముల రిజిస్ట్రేషన్ కోసం.. ముందుగా సర్వే చేసి.. అక్కడి భూమికి, రికార్డుల్లో సమాచారం సరిపోలితేనే ఇక నుంచి రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ఇక ఒక్కసారి రిజిస్ట్రేషన్ అయిన భూమి సర్వే నంబర్లు గానీ, విస్తీర్ణం గానీ మార్చే అవకాశం లేకుండా పక్కా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమించినా భూభారతితో వారిని గుర్తించనున్నారు. భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో ఎన్నో సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి, రికార్డుల్లో ఉన్న భూమికి అసలు పొంతన ఉండదు. ప్రభుత్వ భూములు, ఇతరుల భూమిని ఆక్రమించి ఉన్న భూముల కంటే ఎక్కువ భూములను రిజిస్ట్రేషన్లు చేసుకునే వారు ఉంటారు. ఇక క్షేత్ర స్థాయిలో ఎక్కువ భూమి ఉన్నా.. రికార్డులు సరిగా లేకపోవడం వల్ల పట్టా పాసు పుస్తకాల్లో తక్కువ భూమి రిజిస్ట్రేషన్ కావడం వంటి ఘటనలు చూస్తూనే ఉన్నాం. దీంతో రైతులు పంట పండించడం కంటే ఎక్కువగా భూరికార్డుల సవరణ కోసం అధికారుల చుట్టూ తిరగడమే ఎక్కువ అవుతోంది. ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో ఈ సమస్యలు మరిన్ని పెరిగాయని ఆరోపించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని సరిచేయడానికి భూభారతి పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెబుతోంది. పైలట్ ప్రాజెక్టు కింద ఈ భూభారతి ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌ను అమలు చేసేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని 5 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి.. అమలు చేసేందుకు రెడీ అయింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ఈ భూభారతి పోర్టల్ పైలట్ ప్రాజెక్టుగా గురువారం ప్రారంభమైంది. ఈ సమగ్ర భూభారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత.. నిజంగా ఉన్న భూమికి.. రికార్డుల్లో ఉన్న సమాచారం సరిగ్గా సరిపోతేనే భూ భారతి పోర్టల్లో భూమిని రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన తర్వాత రైతుకు పట్టాదార్ పాసు పుస్తకంతోపాటు భూధార్ నంబర్‌ను కూడా కేటాయిస్తారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో ఆ భూమికి సంబంధించిన సర్వే నంబర్లను గానీ.. విస్తీర్ణాన్ని గానీ మార్చడానికి అవకాశమే ఉండదు.

రాష్ట్రంలో భూముల వ్యవస్థను పకడ్బందీగా సరిచేసేందుకు రెవెన్యూ శాఖ ఈ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది.ఇక ఈ భూభారతిలో భాగంగా సర్వే, రిజిస్ట్రేషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్లను కలిపి ఒకే పోర్టల్ కిందికి తీసుకువచ్చారు. సర్వే వివరాలు.. స్టాంపులురిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న వివరాలు (22 ఎ, ఇతరత్రా), రెవెన్యూ శాఖ రికార్డుల్లో ఉన్న వివరాలు అన్నీ ఈ పోర్టల్లో అందుబాటులో ఉంచారు. మరోవైపు.. 2020 నవంబరు 2వ తేదీ నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అందులో ఏ సమాచారం ఉంటే దాని ఆధారంగానే భూముల రిజిస్ట్రేషన్ చేపట్టడంతో క్షేత్రస్థాయిలో భారీగా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటన్నింటినీ సరిచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ విధానంలో భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఇక నుంచి భూమిని సర్వే చేయడం తప్పనిసరి చేశారు. ఇందు కోసం మొదట ఇంటిగ్రేటెడ్ పోర్టల్లో భూ సర్వేకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ భూమికి సంబంధించిన రెవెన్యూ దస్త్రాలు, సర్వే శాఖ వద్ద ఉన్న వివరాలతో సరిహద్దు రైతులకు సర్వేయర్లు నోటీసులు ఇస్తారు. తోటి రైతుల సమక్షంలోనే భూమిని సర్వే చేసి తహసీల్దార్లకు రిపోర్టు అందిస్తారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖ.. రైతుకు సర్వే పటం జారీ చేస్తుంది. ఆ సర్వే పటం ఆధారంగా భూ భారతి పోర్టల్లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు రైతు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం క్షేత్రస్థాయిలో సర్వేలో ఎంత భూమి అయితే ఉంటుందో.. అంత భూమికే రిజిస్ట్రేషన్ చేస్తారు. రైతు చేసుకున్న దరఖాస్తుతోపాటు సర్వే పటం ఆధారంగా తహసీల్దార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కలిసి.. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తి చేసి పట్టాదార్ పాసుపుస్తకాన్ని జారీ చేయనున్నారు. దీంతోపాటు రైతుకు భూధార్ కార్డును కూడా జారీ చేస్తారు. ఆ భూదార్ కార్డులో భూమికి సంబంధించిన సమగ్ర వివరాలను పొందుపరుస్తారు. భూదార్ కార్డులో ప్రత్యేక సంఖ్య ఉండటం వల్ల దాన్ని మార్చడానికి వీలు లేకుండా చేశారు. ఈ ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో రైతులే స్వయంగా భూమి నక్షా, భూమి మార్కెట్ విలువ సహా కీలక విషయాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇక తమ పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కూడా కలుపుకుని.. చాలా మంది రైతులు పంట సాగు చేస్తూ ఉంటారు. ఇక అలాంటి భూములు కూడా రిజిస్ట్రేషన్ సమయంలో దొరికిపోనున్నాయి.



## మామిడి రైతులపై యుద్ధ ప్రభావం

జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 9 :

భారత్‌లో మామిడి సీజన్ ప్రారంభమైందంటే ఎగుమతిదారులలో ఎంతో ఉత్సాహం కనిపిస్తుంది. కానీ, 2026 ఏప్రిల్ నెలలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పశ్చిమాసియాలో ముఖ్యంగా ఇరాన్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా భారతీయ మామిడి ఎగుమతులు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మేలైన రకాలపై ఆల్ఫాన్సో, కేసర్, మన తెలుగు రాష్ట్రాల్లోప్రసిద్ధి చెందిన బంగినపల్లి వంటి రకాల ఎగుమతులకు ఈ యుద్ధం పెద్ద అడ్డంకిగా మారింది. రెండు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించింది. దీనికి తోడు ఎర్ర సముద్రంలో నెలకొన్న అలజడుల వల్ల ప్రధాన షిప్పింగ్ లైన్లు తమ నౌకలను కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా మళ్లించాల్సి వస్తోంది. ఈ మార్పు వల్ల ప్రయాణం కాలం విపరీతంగా పెరగడమే కాకుండా ఓడరేవుల్లో రద్దీ పెరిగి కంటైనర్లు సకాలంలో తిరిగి రావడం లేదు. మామిడి వంటి త్వరగా పాడైపోయే పండ్ల రవాణాకు రీఫర్ అని పిలిచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్లు అత్యవసరం. ఈ కంటైనర్లలో ఉష్ణోగ్రతను కచ్చితంగా 11 నుంచి 18 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంచాలి. భారత్ సొంతంగా ఈ రీఫర్ కంటైనర్లను తయారుచేయదు. మనం పూర్తిగా అంతర్జాతీయ షిప్పింగ్ లైన్లపైనే ఆధాపడుతున్నాం. యుద్ధం కారణంగా ఈ కంటైనర్ల రాకపోకలు మందగించడంతో ప్రస్తుతం మార్కెట్‌లో వీటి కొరత తీవ్రంగా ఉంది. యుద్ధం కారణంగా రవాణా రంగంపై పడిన ఆర్థిక భారం సామాన్యులను దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. గల్ఫ్ దేశాలకు వెళ్లే సముద్ర రవాణా ఛార్జీలు కొన్ని మార్గాల్లో ఏకంగా 8 రెట్లు పెరిగాయి. యుద్ధం ఉన్న ప్రాంతాల గుండా ప్రయాణించే నౌకలపై బీమా ఛార్జీలు, అదనపు పన్నులు భారీగా పెరిగాయి. కేవలం మార్చి నెలలోనే రీఫర్ కంటైనర్ల ఛార్జీలు వెయ్యి డాలర్లు వరకు పెరిగాయి. కొన్ని మార్గాల్లో సుమారు నాలుగువేల డాలర్ల వరకు అదనపు పన్నులు విధిస్తున్నారు. ఇది సాధారణ రవాణా ఖర్చు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. ప్రపంచ మామిడి ఉత్పత్తిలో భారత్ అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పండే మామిడిలో 44 శాతం అంటే సుమారు 20.68 మిలియన్ టన్నులు భారత్ నుంచే వస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ 56.5 మిలియన్ డాలర్ల విలువైన 29,938 టన్నుల తాజా మామిడి ఎగుమతి చేసింది. మన ఎగుమతుల్లో 40 శాతం నుంచి 45 శాతం వాటా గల్ఫ్ దేశాలదే. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉండే పీక్ సీజన్‌లో ఎగుమతిదారులకు ఇప్పటికే భారీ ఆర్డర్లు ఉన్నాయి. మామిడి పండు కోసిన తర్వాత కేవలం 28 రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది. సముద్ర మార్గంలో ప్రయాణ కాలం పెరగడం వల్ల పండ్లు గమ్యస్థానానికి చేరే లోపే పాడైపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల ఎగుమతిదారులు విమాన రవాణాను ఎంచుకోవాల్సి వస్తోంది. సముద్ర రవాణా ఖర్చు కేజీకి 50 నుంచి 80 రూపాయలు. విమాన రవాణా ఖర్చు కేజీకి 240 రూపాయల నుంచి 300 రూపాయలు. విమాన రవాణా దాదాపు ఐదు నుంచి ఆరు రెట్లు ఖరీదైనదిగా కావడంతో ఎగుమతిదారుల లాభాలు తగ్గిపోతున్నాయ. ఈ సంక్షోభం కేవలం ఎగుమతిదారులకే పరిమితం కాలేదు. మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని రైతులకు కూడా ఇది పెద్ద దెబ్బ. ఎగుమతులు నిలిచిపోతే, ఆ నిల్వలన్నీ స్థానిక మార్కెట్‌కు మళ్లుతాయి. దీని వల్ల దేశీయంగా మామిడి ధరలు భారీగా పడిపోయి రైతులకు కనీస పెట్టుబడి పోటీని ఎదుర్కోవడంలో కూడా భారత్ వెనుకబడే అవకాశం ఉంది.ఈ సమస్య కేవలం మామిడికే పరిమితం కాలేదు. అరటి, ద్రాక్ష, ఉల్లిపాయలు, సీ ఫుడ్ వంటి త్వరగా పాడైపోయే వస్తువులపై కూడా ఈ ప్రభావం పడింది. ముంబైలోని జేఎన్పీటీ ఓడరేవులో వందలాది కంటైనర్లు నిలిచిపోయాయి.



## పవర్ ఫుల్ ఉమెన్ నుంచి జైలు గోడలవరకు..

- కళింగిరి శాంతి ప్రస్థానం

జయభేరి, కాకినాడ, ఏప్రిల్ 9 :

దేవాదాయ శాఖలో అత్యంత వివాదాస్పద అధికారిగా పేరు పొందిన అసిస్టెంట్ కమిషనర్ కళింగరి శాంతి ఉదంతం, అధికార బలం ఉంటే వ్యవస్థలను ఎలా శాసించవచ్చో చెప్పడానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. కేవలం ఆరేళ్ల సర్వీసులో, అందులోనూ రెండేళ్ల సస్పెన్షన్ కాలం పోను, కేవలం నాలుగేళ్లలోనే ఆమె సృష్టించిన ప్రకంపనలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయ్యి, 14 రోజుల రిమాండ్‌కు వెళ్లడంతో ఆమె అప్రతిహత ప్రస్థానానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.2020లో దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరిన కళింగరి శాంతికి, అప్పటి అధికార పార్టీలో కీలక నేతగా ఉన్న విజయసాయి రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ రాజకీయ అండతో ఆమె అటు ఉద్యోగ పరంగా, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ తీవ్ర వివాదాలకు కేంద్ర బిందువైంది. భర్త మదన్ మోహన్‌తో విడాకులు తీసుకోకుండానే మరొకరితో సహజీవనం చేయడం, ఒక బిడ్డకు జన్మనివ్వడం వంటి అంశాలు అప్పట్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఆ బిడ్డ తండ్రి ఎవరనే విషయంలో భర్త మదన్ మోహన్ చేసిన ఆరోపణలు, విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్షలు చేయాలన్న డిమాండ్లు అప్పట్లో సంచలనం సృష్టించాయి.శాంతి అధికార దర్పం ఏ స్థాయిలో ఉండేదంటే, విశాఖపట్నంలో పనిచేస్తున్న సమయంలో తన పై అధికారి అయిన డెప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ గదిలోకి చొరబడి ఆయనపై ఇసుక చల్లడం ఆమె బరితెగింపునకు పరాకాష్ట. ఒక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఆమె ఈ చర్యకు పాల్పడటం గమనార్హం.ఈ ఘటన సీసీటీవీలో రికార్డ్ అయినప్పటికీ, విచారణాధికారి తప్పు పట్టినప్పటికీ, ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోకుండా, ఫిర్యాదు చేసిన పై అధికారిని బదిలీ చేయడం వ్యవస్థల నిర్వీర్యానికి నిదర్శనం. దీంతో మనస్తాపం చెందిన డెప్యూటీ కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.విశాఖలో పని చేస్తున్న సమయంలో 'ప్రేమ సమాజం' భూములు, ఇతర దేవాదాయ భూముల లీజుల వ్యవహారంలో ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెను సస్పెండ్ చేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆమెను డిస్మిస్ చేసే ఫైల్ ముందుకు కదలలేదనే విమర్శలు ఉన్నాయి. కోర్టు ఆదేశాలతో మార్చి చివరి వారంలో తిరిగి పోస్టింగ్ పొందిన శాంతి, పది రోజులు గడవకముందే ఏసీబీ వలలో చిక్కుకుంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై ఏసీబీ ఆమెను అరెస్ట్ చేసి జైలుకు పంపింది.శాంతి ఉదంతం రెండు ముఖ్యమైన పాఠాలను నేర్పుతుంది. రాజకీయ నాయకుల మద్దతు ఉంటే చట్టాన్ని, నిబంధనలను అతిక్రమించవచ్చనే ధీమా అధికారులను ఎంతటి పతనానికి తీసుకెళ్తుందో శాంతి జీవితం ఒక హెచ్చరిక. ఒక జూనియర్ అధికారి ఇంతగా రెచ్చిపోతున్నా.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆమె విషయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి.

## పౌష్టికాహారంతో పిల్లలకు మంచి ఆరోగ్యం

- దొనకొండ సర్పంచ్ శ్రావణి సురేష్ యాదవ్
- సర్పంచిని సన్మానించిన అంగన్వాడి సిబ్బంది

జయభేరి, దంతాలపల్లి ఏప్రిల్ 9 :



మండలం దొనకొండ గ్రామంలో ఏఎల్ఎం కమిటీ నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఆవుల శ్రావణి సురేష్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సమావేశానికి చైర్మన్ గా వ్యవహరించారు, ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించడం వల్ల పెరుగుదల శారీరక దృఢత్వం మానసిక ఎదుగుదల త్వరగా జరుగుతుందని పిల్లలు గర్భిణీలు బాలింతలు ఆరోగ్యవంతగా తయారవుతారని అన్నారు ఆరోగ్యవంతమైనసమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం పౌష్టిక ఆహారం అందిస్తుందని అందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఆవుల మంజుల హెల్పర్ పంతం వెంకటలక్ష్మి లు సర్పంచి శ్రావణి సన్మానించారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మార రమేష్, ఉప సర్పంచ్ బోయిని యాదగిరి,వివో అధ్యక్షురాలు దేశగాని సుజాత,వార్డ్ మెంబర్ కోడి లింగమ్మ,పిల్లల తల్లిదండ్రులు బోయిని ఉమారాణి, సుస్మిత, చొప్పరి స్వరూప,రమ, లికిత, తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ పై అవగాహన చైతన్యం కలిగి ఉండాలి

- దంతాలపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ.. వైద్యాధికారి డాక్టర్ కవిత!

జయభేరి, దంతాలపల్లి ఏప్రిల్ 09 :




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దంతాలపల్లి వైద్యాధికారి డాక్టర్ కవిత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలలో అవగాహన చైతన్యం కల్పిస్తూ రెండు మండలాలలోని ప్రభుత్వ శాఖల ఉద్యోగులందరికీ అంగన్వాడీ టీచర్స్ ఆయాలకి పాఠశాలలు మరియు హాస్టల్స్ లో (మధ్యాహ్న) భోజనము తయారు చేసే ఫ్రంట్ లైన్ వర్కర్స్ అందరికీ హెచ్ఐవి పరీక్షలు చేయించడం జరిగిందన్నారు ఎయిడ్స్ వ్యాధి కలిగిన రోగులను ప్రేమతో ఆదరించాలని", "ఎయిడ్స్ వ్యాధి అంటుకునే వ్యాధి కాదని అంటించుకునే వ్యాధిని", సూచించారు. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి దంతాలపల్లి అంబేద్కర్ సెంటర్ వరకు హెచ్ఐవి వ్యాధిపై నినాదాల తో ర్యాలీగా వెళ్లి మానవహారము ఏర్పాటు చేసి ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించడం జరిగినది.. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సంజీవరావు హెల్త్ సూపర్వైజర్స్ బీమా నాయక్ మంగమ్మ ల్యాబ్ టెక్నీషియన్ శరత్ బాబు హెల్త్ అసిస్టెంట్ చలపతిరావు శ్రీనివాసులు సత్యనారాయణ నర్సింగ్ ఆఫీసర్స్ స్వప్న రాణి మామిడి స్వర్ణ ఆశాలు ధనమ్మ వెన్నెల పుష్పనీలా విమల శోభారాణి స్వరూప స్వర్ణలత పాల్గొనడం జరిగినది..

## మూడు నెలల్లో వరంగల్ విమానాశ్రయానికి ఫౌండేషన్

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో విమానయాన రంగాన్ని విస్తరించడంలో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి మరో మూడు నెలల్లో ఫౌండేషన్ వేయబోతున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి కూడా మార్గం సుగమమైంది. రక్షణ శాఖకు చెందిన 360 ఎకరాలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం మరో 450 ఎకరాలు భూమి సేకరిస్తే.. ఈ ఎయిర్పోర్ట్ రూపుదిద్దుకుంటుందని అన్నారు. రక్షణ శాఖ వ్యూహాత్మక ప్రాంతం కావడంతో డిఫెన్స్ మినిస్ట్రీనే దీనిని నిర్మిస్తుంది. సివిల్ ఏవియేషన్ శాఖ ప్రత్యేక టర్మినల్ను ఏర్పాటు చేస్తుంది. ఏప్రిల్ 17న OLS సర్వే నిర్వహించి, ఎయిర్ పోర్ట్పై మాస్టర్ ప్లాన్ను ఖరారు చేస్తామని అన్నారు.

## కారులోనే యవ్వారం




జయభేరి, ఛండీఘఢ్, ఏప్రిల్ 9 :

పంజాబ్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా పాకిస్థాన్ మద్దతుతో నడుస్తున్న ఒక అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠాను పంజాబ్ పోలీసులు చేధించారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 16.8 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుని, ఒక మహిళతో సహా నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. అరెస్ట్ అయిన వారిని బల్వీందర్ సింగ్ (కపుర్తలా), సుమన్ ప్రీత్ కౌర్, హర్పాల్ సింగ్, జస్కరణ్‌బీర్ సింగ్ (అమృత్‌సర్)గా గుర్తించారు. వీరు మారుతీ బలెనో కారులో డ్రగ్స్ తరలిస్తుండగా పోలీసులు పక్కా సమాచారంతో మాటు వేసి పట్టుకున్నారు.ఈ డ్రగ్స్ నెట్‌వర్క్ వెనుక పాకిస్థాన్, దుబాయ్ కేంద్రంగా పనిచేస్తున్న హ్యాండ్లర్ల హస్తం ఉందని ప్రాథమిక విచారణలో తేలినట్టు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. ఈ హెరాయిన్ నిల్వలను అమృత్‌సర్ సరిహద్దు ప్రాంతం నుంచి సేకరించి, చండీగఢ్‌లో డెలివరీ చేసేందుకు నిందితులు ప్లాన్ చేశారు. కాగా, నిందితుల వద్ద నుంచి డ్రగ్స్‌తో పాటు ఓ కారును కూడా స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఈ ముఠాకు ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి? గతంలో ఇలాగే ఎన్నిసార్లు డ్రగ్స్ సరఫరా చేశారు? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.



## చేసింది ఒకే ఒక్క సినిమా..

అందం అభినయం ఉన్న భామలు ఈ మధ్యకాలంలో అంతగా అవకాశాలు అందుకోలేకపోతున్నారు. కానీ ఈ చిన్నది మాత్రం తన అందంతోనే స్టార్ హీరోయిన్స్ రేంజ్‌లో క్రేజ్ తెచ్చుకుంది. ఇంకా మొదటి సినిమా రిలీజ్ కూడా కాలేదు అప్పుడే ఎలాంటి పాత్రైనా సరే రెడీ అంటుంది. ఇంతకూ ఆమె ఎవరో కాదు రామ్ గోపాల్ వర్మ వదిలిన బాణం ఆరాధ్యదేవి. ఈ అమ్మడి అసలు పేరు శ్రీలక్ష్మి సతీష్. 23 ఏళ్ల ఈ అందాల భామ ఇప్పుడు హీరోయిన్‌గా మారి సినిమాలు చేస్తోంది. సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఈ అమ్మడిని సోషల్ మీడియాలో వెతికి మరీ పట్టుకున్నాడు. సోషల్ మీడియాలో రీల్స్ చేసే ఈ అమ్మడి అందాన్ని చూసి ఫిదా అయిన వర్మ ఆమెను హీరోయిన్‌గా పెట్టి సినిమా చేయాలని ఫిక్స్ అయ్యాడు. అనుకున్నట్టుగానే ఆమెను హీరోయిన్‌గా పెటి శారీ అనే సినిమాను అనౌన్స్ చేశాడు. ఇక ఈ సినిమాలో ఆరాధ్య దేవి అందాలను ఓ రేంజ్ లో చూపించనున్నాడు వర్మ.. ఈ సినిమా వచ్చి పోయింది కూడా చాలా మందికి తెలియదు. నెట్టింట ఓ రేంజ్‌లో రెచ్చిపోయి అందాలు ఆరబోస్తుంటే నెటిజన్స్ షాక్ అవుతున్నారు.



## వారణాసి కథ ఇదేనా?


షూటింగ్‌కు ముందే తన సినిమా కథల్ని రివీల్ చేస్తుంటారు అగ్ర దర్శకుడు రాజమౌళి. చాలా సినిమాల విషయంలో ఆయన ఇదే ఆనవాయితీని పాటించారు. అయితే 'వారణాసి' సినిమా కొచ్చేసరికి కథాంశం విషయంలో కాస్త గోప్యత పాటిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌లో కథకు సంబంధించిన బేసిక్ లైన్‌ను మాత్రమే బయటపెట్టారు. టైమ్ ట్రావెల్ కథ ఇదని, రామాయణ ప్రస్తావన కూడా ఉంటుందని, ఓ ఎపిసోడ్‌లో హీరో మహేశ్‌బాబు రాముడి పాత్రలో కనిపిస్తాడనే వివరాల్ని వెల్లడించారు. అయితే అభిమానులు మాత్రం 'వారణాసి' అసలు కథేంటి అనే అన్వేషణలో పడ్డారు. ఈ నేపథ్యంలో సోషల్‌మీడియాలో అనేక లీకులొస్తున్నాయి. తాజాగా ప్రముఖ హాలీవుడ్ విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ 'వారణాసి' కథ గురించి కొన్ని ఆసక్తికరమైన వివరాల్ని అందించింది. అద్భుతశక్తులు కలిగిన త్రేతాయుగం నాటి మహిమాన్విత విశ్వ కళాఖండాన్ని సాధించి, తద్వారా ప్రపంచ ఆధిపత్యాన్ని సాధించాలనే దురాలోచన చేస్తాడు క్రూరుడైన కుంభ (పృథ్వీరాజ్ సుకుమారన్). దాని సాధనకై శివ భక్తుడైన రుద్ర (మహేశ్‌బాబు)ను ఎంచుకుంటాడు. కుంభ (పృథ్వీరాజ్ సుకుమారన్) ఆదేశాల మేరకు టైమ్ ట్రావెల్ చేసి ఆ శక్తిని సాధించేందుకు పూనుకుంటాడు రుద్ర. ఈ క్రమంలో అతను కొన్ని పురాతన రహస్యాలతో పాటు ఓ చీకటి నిజాన్ని తెలుసుకుంటాడు. కుంభ ఓ కుట్రదారుడని, ప్రపంచ ఆధిపత్యం కోసమే తనను ఈ కాలయాత్రకు పురమాయించాడని అర్థం చేసుకుంటాడు. ఈ నేపథ్యంలో రామాయణ కాలంనాటి ఆ కళాఖండాన్ని పొందడానికి రుద్ర ఏం చేశాడు? కుంభ కుట్రల్ని ఎలా ఛేదించాడు? అన్నదే ఈ చిత్ర కథ అని సదరు విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ తన కథనంలో పేర్కొన్నది. ఈ వార్తలో నిజమెంతో తెలియదు కానీ..సోషల్‌మీడియాలో మాత్రం తెగ వైరల్ అవుతున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న 'వారణాసి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

## విజయ్ 'జననాయగన్' లీక్..



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న టీవీకే అధిపతి విజయ్‌కు ఊహించని షాక్. ఆయన నటించిన 'జననాయగన్' సినిమాను విడుదలకు ముందే ఆన్‌లైన్‌లో వైరలవుతోంది. రాజకీయాలపై సెటైరికల్‌గా వస్తున్న ఈ చిత్రంలోని ఐదు నిమిషాల క్లిప్‌ను పైరసీ వీరులు నెట్టింట పెట్టేశారు. దాంతో.. ఆగ్రహించిన విజయ్ అభిమానులు లీక్ చేసిన వాళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. టీవీకే చీఫ్ విజయ్ కొత్త సినిమా జననాయగన్ వాయిదాల పర్వం నడుస్తున్న వేళ సినిమాలోని కొన్ని సీన్లు లీకవ్వడం తమిళనాట దుమారం రేపుతోంది. చిత్రం టైటిల్, విజయ్ ఎంట్రీ సీన్లతో పాటు ఐదు నిమిషాల క్లిప్ లీకైంది. అయితే.. సినిమా ఎడిటింగ్ సమయంలో పొరపాటను కొన్ని సీన్లు లీక్ అయ్యాయని భావిస్తున్నారు. ఎందుకంటే వీడియో ఆఖర్లో ఒక వ్యక్తి పాస్ బటన్ నొక్కడం రికార్డైంది. దాంతో, లీక్ చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నిర్మాణ సంస్థ కేవీఎన్‌పై విజయ్ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. సీన్లు లీకవ్వడంతో అప్రమత్తమైన చిత్ర నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో జననాయగన్ సీన్లపై రిపోర్ట్ చేయాలని అభిమానులను కోరింది.

## బాక్సాఫీస్ దగ్గర దూసుకెళ్తున్న 'ధురంధర్ 2'..
## అనుకున్న సమయానికి ముందే స్ట్రీమింగ్‌కు సిద్ధం



భారీ అంచనాల మధ్య విడుదలైన 'ధురంధర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుత ప్రదర్శనతో ప్రభంజనం సృష్టిస్తోంది. విడుదలైన మూడు వారాల్లోనే దాదాపు రూ.1700 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన ఈ సినిమా, త్వరలోనే రూ.1800కోట్ల మార్కును అందుకునే దిశగా దూసుకెళ్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తుండగా, ఇప్పటికీ అనేక థియేటర్లలో డీసెంట్ కలెక్షన్లతో తన సత్తాను కొనసాగిస్తోంది.

అయితే ఐపీఎల్ సీజన్ ప్రభావం, అలాగే సినిమా సుదీర్ఘమైన రన్‌టైమ్ కారణంగా రూ.2000 కోట్ల మైలురాయిని చేరుకోవడం కాస్త కష్టంగా కనిపిస్తోంది. అయినప్పటికీ, ప్రస్తుత వసూళ్ల దృష్ట్యా ఇది ఇప్పటికే ఇండస్ట్రీ హిట్ దిశగా పయనిస్తున్న చిత్రంగా ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఇక ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ విడుదలపై కూడా భారీ చర్చ నడుస్తోంది. మొదటి భాగం నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. దీంతో రెండో భాగానికి కూడా అదే సంస్థ భారీగా రూ.250కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అయితే, మేకర్స్ ఆ ఆఫర్‌ను తిరస్కరించి, తమ సొంత ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన జియో హాట్ స్టార్‌లోనే ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకోవడం విశేషంగా మారింది.

ముందుగా ఈ చిత్రాన్ని సెప్టెంబర్ నెలలో డిజిటల్ స్ట్రీమింగ్‌కు తీసుకురావాలని భావించినప్పటికీ, థియేట్రికల్ రన్ క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ప్లాన్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. తాజా సమాచారం ప్రకారం, మే నెలాఖరు లేదా జూన్ మొదటి వారంలోనే 'ధురంధర్ 2' ఓటీటీ ప్రీమియర్ జరగవచ్చని టాక్ వినిపిస్తోంది.

థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులకు, లేదా మళ్లీ చూడాలని ఆశించే అభిమానులకు ఈ ఓటీటీ విడుదల శుభవార్తగా మారనుంది.

ఇక ఈ విషయంపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తానికి, బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్న 'ధురంధర్ 2' సినిమా, త్వరలోనే ఓటీటీ వేదికగా కూడా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.



## అబ్బాయిల డ్రీమ్ గర్ల్..

వరుసగా సినిమాలు చేసి ఆ తర్వాత అవకాశాలు లేక సోషల్ మీడియాతోనే గడిపేస్తున్న హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. వారిలో ఈ అమ్మడు ఒకరు. ఈ చిన్నది చేసింది 12 సినిమాలు కానీ హిట్స్ మాత్రం ఒకటి రెండు మాత్రమే.. హిందీలోనూ ట్రై చేసింది కానీ .. అక్కడా లాభం లేకుండా పోయింది. అవకాశాలు లేక తన గ్లామర్ తో దర్శక నిర్మాతలను ఆకర్షిస్తున్న ఈ అమ్మడు ఎవరో కాదు.. తెలుగులో చేసిన మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. తన అందం, అభినయంతో కట్టిపడేసింది. కానీ ఆతర్వాత అంతగా సక్సెస్ అందుకోలేకపోయింది. వరుసగా సినిమాలు చేసినప్పటికీ అంతగా హిట్స్ అందుకోలేదు. ఆమె ఎవరో కాదు బోల్డ్ బ్యూటీ సీరత్ కపూర్. శర్వానంద్ హీరోగా నటించిన రన్ రాజా రన్ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. ఆతర్వాత ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో మెప్పించింది. ఆతర్వాత తెలుగులో ఎక్కడా కనిపించలేదు ఈ చిన్నది. ఈ ముద్దుగుమ్మకు అనుకున్నంతగా గుర్తింపు రాలేదు. దీంతో అవకాశాలు సైతం తగ్గిపోయాయి. స్పెషల్ సాంగ్స్ కూడా చేసింది కానీ అంతగా గుర్తింపు రాలేదు. అయితే ఈ హీరోయిన్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ అయ్యింది. బాలీవుడ్ ఇండస్ట్రీలో కొరియోగ్రాఫర్ గా చేసిన సీరత్ కపూర్.. ఆ తర్వాత నటనపై ఆసక్తితో హీరోయిన్ గా అడుగుపెట్టింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**